క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి

కదిరి అర్బన్: వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అంజనప్ప ఆధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ రాధాబాయ్, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి 15 రోజుల కోసారి వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలని చెప్పారు. నూతన ప్రభుత్వ సహకారంతో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. అనంతరం అజెండాలోని వివిధ శాఖల ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. కార్యక్రమంలో సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

3,800 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ

అమడగూరు: మండలంలో ఇప్పటి వరకు 3,800 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగకాయలు పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి వెంకటరమణాచారి తెలిపారు. బుధవారం ఆయన గుండువారిపల్లి, తుమ్మల రైతు భరోసా కేంద్రాల్లో జరుగుతున్న విత్తన పంపిణీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తన పంపిణీ దాదాపుగా పూర్తి చేశామన్నారు. అయితే ఇంకా కొంతమంది విత్తనాల కోసం వస్తుండటంతో ఉన్నతాధికారులతో మాట్లాడి మళ్లీ 1,500 క్వింటాళ్ల విత్తనకాయలకు ఇండెంట్ పెట్టామన్నారు. సరఫరా కాగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతామన్నారు. వచ్చే కాయలను అన్ని పంచాయతీలకూ అవసరం మేరకు సర్దుబాటు చేసి అందరికీ పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సబ్సిడీ విత్తనకాయలు తీసుకుని సాగు చేయకుంటే ప్రభుత్వ పరిహారాలు నిలిపివేస్తామన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



వైద్య సేవలపై సిబ్బందిని విచారిస్తున్న అధికారులు

తాడిమర్రి: ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఢిల్లీ నుంచి వచ్చిన నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాష్) అసెసర్లు డాక్టర్ అభిషేక్ సుభాష్ గోసవి, డాక్టర్ రాతికంట సాహా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం వారు తాడిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు, మందుల నిల్వ గదులు, అడ్మిషన్, కాన్పుల గదులను పరిశీలించారు. టాయిలెట్స్ శుభ్రత, పరిసరాల పరిశుభ్రతలపై ఆరాతీశారు. వైద్య సిబ్బందితో మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన సేవలందించాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, క్షయవ్యాధి నిర్మూలన టీకాలను క్రమం తప్పకుండా వేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలు కొనసాగించాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హరిత, గోవర్ధన్ నాయుడు, సీహెచ్ఓ హేమలత, ఎంపీహెచ్ ఈఓ నారాయణమ్మ, ఎంపీహెచ్ఎస్ రామ్‌కుమార్, సీహెచ్ఓ లక్ష్మీదేవి, ఎల్‌టీ మస్తాన్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



ఎస్పీని కలసిన ఎస్‌ఐ విజయనాయక్

పుట్టపర్తి టౌన్: అనంతపురం వన్‌టౌన్ ఏఎస్ఐగా పనిచేస్తున్న విజయనాయక్ ఎస్‌ఐగా పదోన్నతిపై శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. బుధవారం ఆయన పుట్టపర్తిలో ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ సూచించారు.

జోరుగా వర్షం



ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలో బుధవారం సాయంత్రం జోరుగా వర్షం కురిసింది. రెండు గంటల పాటు వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయం అయ్యాయి. మట్టి రహదారులు బురదమయంగా మారాయి. ప్రధాన రహదారులు, కాలువల్లో వర్షపు నీరు పారింది.

కరెంట్‌తో తస్మాత్ జాగ్రత్త

- వర్షాకాలంలో అప్రమత్తత ముఖ్యం
- నిర్లక్ష్యం వహిస్తే అంతే సంగతులు
- విద్యుత్ తీగలు, మోటార్ల వద్ద జరభద్రం



విద్యుత్ స్తంభానికి అమర్చిన స్టార్టర్ పెట్టె



పొలాల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు



రైతులు కట్టెలపై అమర్చుకున్న విద్యుత్ వైర్లు

ధర్మవరం రూరల్: తొలకరి జల్లులు కురవడం, మృగశిర కార్తె ప్రారంభం కావడంతో రైతులు పొలం బాట పట్టారు. ఇప్పటికే పొలాలను దుక్కి దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. ఆపై విత్తు నుంచి పంట దిగుబడి వచ్చే వరకు వ్యవసాయ పనులపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తారు. పంటలకు నీరు పెట్టడం కోసం తెల్లవారితే చాలు విద్యుత్ తీగలు, విద్యుత్ మోటార్ల వద్ద పనిచేస్తుంటారు. చాలామంది రైతులు చిన్న చిన్న విద్యుత్ మరమ్మతులను స్వయంగా చేస్తుంటారు. ఇలాంటి సమయంలో జాగ్రత్తలు వహించకపోతే మృత్యువాత పడే ప్రమాదం ఉంది. పొలాల్లో కర్ర స్తంభాలు, వేలాడుతున్న తీగల విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ట్రాన్స్‌కో అధికారులు హెచ్చరిస్తున్నారు.

మోటార్ల వద్ద పొంచిన ప్రమాదం

రైతులు తక్కువ ధరలకు లభించే మోటార్లు ఎక్కువగా వాడుతుంటారు. చాలామంది మోటార్లు ఆరు బయట, బావి, కాలువ ఒడ్డున ఉంచి చిన్న కవర్ కప్పి ఉంచుతారు. అనంతరం వాటిని పట్టించుకోకపోవడంతో మోటార్లతో ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉంది. సింగిల్‌ఫేజ్ తీగ కాలికి తగిలితే మోటారు మొత్తానికి విద్యుత్ ప్రవహిస్తుంది. దానిని తాకగానే కరెంట్ షాక్‌కు గురవుతారు. జాగ్రత్తలు వహిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చునని అధికారులు చెపుతున్నారు.

స్టార్టర్లతో జాగ్రత్త..

స్టార్టర్ డబ్బాలను మోటార్ పక్కనే పొలంలో ఉంచి కవర్లు కప్పుతుంటారు. ఇది ప్రమాదాలకు తావిచ్చే అవకాశాలు లేకపోలేదు. డబ్బాలకు ఉన్న తలుపుల గురించి పట్టించుకోరు. వాటిలోకి నీరు చేరుతుంది. తీగలు కూడా గజిబిజిగా ఉంటూ అతుకులతో కనిపిస్తుంటాయి. ఏ తీగ ఏ ఫ్యూజుదో కూడా తెలియని విధంగా ఉంటాయి. వీటిపట్ల జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరిస్తునానరు. రక్షణ కవర్లను తీసి వేయరాదు. నేరుగా స్టార్టర్లకు విద్యుత్ సరఫరా అయ్యేలా ఫీజు అమర్చుకోవాలి. సొంతంగా మరమ్మతులు చేయడం మంచిది కాదు. స్టార్టర్ల డబ్బాలకు తలుపులు తప్పనిసరిగా ఉండాలి.

ఇనుప డబ్బాలతో జాగ్రత్త

చాలామంది రైతులు ఇప్పటికీ స్టార్టర్ల కోసం ఇనుప డబ్బాలే ఉపయోగిస్తారు. ఫ్యూజులు బిగించడంతో ఎలుకలు డబ్బాల్లోకి వెళ్లి తీగలు కొరికేస్తుంటాయి. అలాంటి చోట డబ్బాకు విద్యుత్ సరఫరా అవుతుంటుంది. ఇది తెలియని రైతులు డబ్బాను పట్టుకునే ప్రయత్నం చేయగానే షాక్‌కు గురవుతారు.

తీగలతో ప్రమాదం

గాలీవానలకు ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు తెగి పడుతుంటాయి. ఆ సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే పొలంలో నుంచి విద్యుత్ తీగలు తీసుకొచ్చి ఇళ్లల్లో కట్టి పడేస్తుంటారు. ఈ సమయంలో ఎలుకలు కొరికే అవకాశం ఉంటుంది. రైతులు తీగలను ప్రారంభించే సమయంలో తప్పనిసరిగా పరీక్షించాలి. అనంతరం మోటార్లకు తీగలను అమర్చుకోవడం మంచిది. విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్న ప్రదేశాల్లో కొందరు రైతులు మధ్య మధ్యలో తాత్కాలికంగా కర్రలు వేసుకొని వాటికి తీగలు అమర్చుకుంటారు. ఇవి వర్షానికి, గాలులకు కిందపడుతుంటాయి. వాటిని గమనించకుండా పొలాల్లో పనులకు వెళ్లేటప్పుడు రైతులు, కూలీల కాలికి తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉంది. స్తంభాలు దూరం ఉంటే ట్రాన్స్‌కో సిబ్బందితో మాట్లాడి స్తంభాలు ఏర్పాటు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

- పొలాల్లో మోటార్లు పనిచేయకపోతే చేతితో పట్టుకోకూడదు. టెస్టర్ సహకారంతో మాత్రమే పరీక్షించాలి. వర్షపు నీరు, తేమ తగలని చోట వాటిని అమర్చి రక్షణగా కవర్ కప్పాలి. మోటారు ఏదైనా మరమ్మతు చేయాలంటే ముందుగా విద్యుత్ సరఫరా నిలిపి వేయాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి

వర్షాకాలంలో విద్యుత్ మోటార్ల వద్ద రైతులు జాగ్రత్తలు పాటించాలి. స్టార్టర్లు, మోటార్లకు అమర్చిన విద్యుత్‌వైర్లను తప్పని సరిగా పరీక్షించుకోవాలి. లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. చేతితో స్టార్టర్ పెట్టెలను తాకవద్దు. రబ్బరు చెప్పులు వేసుకొని ఎండు పుల్లలతో పెట్టెను తెరవాలి. రైతులు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చు.

– జానకి రామయ్య,
ఏఈ, ట్రాన్స్‌కో, ధర్మవరం

రూ.2 కోట్లతో నృసింహుడి ఆలయ నిర్మాణం



అలంకరణలో లక్ష్మీనృసింహుడు



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వేద పండితులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో బుధవారం ఓబుళ లక్ష్మీ నృసింహ స్వామి నూతన దేవాలయ నిర్మాణానికి వేద పండితులు భూమిపూజ చేశారు. ఓబుళ లక్ష్మీనృసింహుడి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పాత దేవాలయాన్ని తొలగించారు. ఆ స్థానంలో నూతన దేవాలయాన్ని నిర్మించాలని ఆలయ కమిటీ సభ్యులు తీర్మానించారు. ఇందు కోసం దాతలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో రూ.2 కోట్ల వరకూ విరాళాలు సేకరించారు. అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు మధు స్వామితో పాటు మరో ఇద్దరు అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా భూమిపూజ జరిగింది. అంతకుముందు స్వామి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని ఆలయ కమిటీ సభ్యుడు శివ తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు సద్వినియోగం చేసుకోండి



కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి)ని మడకశిర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంటి ఆస్పత్రి ఏఓ రఫీక్ తెలిపారు. ఎల్వీ ప్రసాద్ కంటి పరీక్ష కేంద్రంలో బుధవారం ఘనంగా ద్వితీయ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. వైద్య సిబ్బందితో కలిసి ఆయన కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన ప్రజలకు కంటి పరీక్షలు చేశారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది మాట్లాడుతూ రెండు సంవత్సరాల్లో ఆస్పత్రిలో 4,979 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. పేద ప్రజలు సద్వినియోగం చేసుకుని కంటి లోపం లేకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు.

పశు వైద్యశిబిరం



సూగురులో పశువులకు వైద్యం అందిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని సూగురు, సడ్లపల్లిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 147 పశువులకు వైద్యచికిత్సలు చేసి గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తు టీకాలు వేశారు. అలాగే 47 పశువులకు గర్భకోశవ్యాధి చికిత్స, చిటుక వ్యాధి, ఏలిక పాముల నివారణ మందు అందించారు. అలాగే 27 ఆడదూడలకు నట్టల నివారణ మందుతో పాటు 250 పశువులకు గోరములకు నివారణకు మందు వేయించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు గిరిధర్, కార్యదర్శి కళ్యాణ్‌కుమార్, అసిస్టెంట్ గవర్నర్ తిమ్మారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెనిక్కాయల చిటపటలు



వేరుశనగ కాయలను ఒలుస్తున్న మహిళలు



వేరుశనగ విత్తనాలను శుభ్రం చేస్తున్న మహిళా రైతులు

గాండ్లపెంట: వేరుశనగ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. అదునులో వర్షం కురవడంతో చెనిక్కాయల చిటపటల శబ్దం గ్రామాల్లో వినిపిస్తోంది. మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో సాధారణంగా 2,650 హెక్టార్లలో వేరుశనగ, 970 హెక్టార్లలో కంది సాగు చేస్తారు. రైతులు పొలాలను దున్ని సిద్ధం చేసుకున్నారు. కాగా ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ధరపై విత్తన వేరుశనగ కాయలను అందిస్తోంది. ఇప్పటి దాకా మండల వ్యాప్తంగా ఉన్న 7 రైతు భరోసా కేంద్రాలకు 2,546 క్వింటాళ్లు చేరాయి. కందులు కూడా రెండు మూడు రోజుల్లో వస్తాయని చెప్పారు. బుధవారం నాటికి 3,052 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుని విత్తనకాయలు తీసుకున్నట్లు ఏఓ లక్ష్మీప్రియ తెలిపారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

బత్తలపల్లి: వేరుశనగ రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా పాటించాలని బత్తలపల్లి ఏఓ ఓబిరెడ్డి సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేరుశనగ విత్తనం వేస్తున్న రైతులకు పలు సూచనలు, సలహాలను అందించారు. ఒక కేజీ విత్తనానికి క్లోరోపైరిఫాస్ 6 ఎంఎల్, కాన్ఫిడార్ ఒక ఎంఎల్, ఎం45 మూడు గ్రాములు, ట్రైకోథెర్మావిండ్ 8నుంచి 10 గ్రాములు చొప్పున కలపాలని సూచించారు. తద్వారా వేరుకుళ్లు తెగులు, కాండం కుళ్లు తెగులు ఆశించకుండా కాపాడుకోవచ్చన్నారు. ఎకరాకు 50 నుంచి 60 కేజీల విత్తనం సరిపోతుందన్నారు. దుక్కిలో 20 కేజీల యూరియా, 100 కేజీల సూపర్, 50 కేజీల పొటాష్ వేసుకోవాలన్నారు. జింక్ సల్ఫేట్ ఎకరాకు 10 కేజీలు దుక్కిలో వేసుకోవాలన్నారు. జూలై 15 వరకు విత్తనం వేసుకోవచ్చునని తెలిపారు.

బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న డీసీపీఓ మహేష్



హాజరైన వీఆర్వోలు, కార్యదర్శులు, మహిళా పోలీసులు

ధర్మవరం అర్బన్: బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని డీసీపీఓ మహేష్, సీడీపీఓలు లక్ష్మి, కవిత, సరస్వతి, పరిరక్షణ అధికారి నాగలక్ష్మి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్డీఓ సమావేశ భవనంలో బుధవారం ధర్మవరం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలలపై లైంగిక దాడుల నిరోధక చట్టంపై మండల, గ్రామస్థాయిలో పనిచేసే అధికారులకు ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల హక్కులను కాపాడాలని, బాలల అభివృద్ధికి మనం ప్రతిఒక్కరూ పాటుపడాలని తెలిపారు. బాలలపై లైంగిక దాడులు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు నిరోధక చట్టంలోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆరు మండలాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్



బత్తలపల్లిలో పుస్తకాలను పాఠశాలలకు తరలిస్తున్న ఎంఈఓలు, సిబ్బంది



తాడిమర్రి విద్యాశాఖ కార్యాలయంలో పాఠ్య పుస్తకాలు

బత్తలపల్లి: విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్య పుస్తకాలు మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరాయి. బుధవారం నుంచి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలకు మొదటి విడత స్టూడెంట్ కిట్స్ (పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, షూస్, సాక్సులు, బెల్టులు)ను ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలు పునః ప్రారంభం రోజే విద్యార్థులందరికీ ఆయా స్టూడెంట్ కిట్స్‌ను ఉపాధ్యాయులు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన పుస్తకాలు

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందజేసేందుకు ఇప్పటి వరకూ 23,004 పాఠ్య పుస్తకాలు ఎమ్మార్సీకి చేరినట్లు మండల విద్యాశాఖ అధికారి–2 ప్రసన్నకుమార్ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 23,120 నోట్‌బుక్స్ కూడా వచ్చినట్లు పేర్కొన్నారు. వీటిని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మాత్రమే అందజేయడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలతో కలపి మొత్తం 9 ఉన్నత పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలలు, 44 ప్రాథమిక పాఠశాలలు ఉన్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి పుస్తకాల పంపిణీ

తాడిమర్రి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం నుంచి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయనున్నారు. మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, తొమ్మిది ప్రాథమికోన్నత, 21 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 1,756 మంది విద్యార్థులు ఉండగా అధికారులు 16 వేల పుస్తకాలను కేటాయించారు. అయితే ఇప్పటి వరకు 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు వచ్చాయి. ఇక ఒకటి నుంచి ఏడో తరగతి వరకు అరకొరగా వచ్చాయి. ఇప్పటి వరకు 11,450 పాఠ్య పుస్తకాలు చేరినట్లు ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేషులు తెలిపారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

హిందూపురం టౌన్: పుణ్యక్షేత్రాలైన కాశీ, అయోధ్యలకు హిందూపురం ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24న అయోధ్య, కాశీకి 8 రోజుల యాత్ర నిమిత్తం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. అయోధ్య, కాశీ యాత్రకు రానుపోను ఒక్కొక్కరికీ రూ.8,500 చార్జీలు నిర్ణయించామన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టికెట్లు కావాల్సిన వారు సెల్ నంబర్ 9440834715ను సంప్రదించాలని కోరారు. అలాగే జూలై నెలలో 12వ తేదీ శుక్రవారం, ఆగస్టు నెలలో 9వ తేదీ హిందూపురం డిపో నుంచి అయోధ్య, కాశీకి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

తెలుగు జాతి ఆణిముత్యం ‘సినారె’

అనంతపురం కల్చరల్: తెలుగుజాతి సాహితీ ఆణిముత్యం సినారె అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం అనంతపురంలోని విశాలాంధ్ర బుక్ హౌస్‌లో ప్రసిద్ధ కవి, రచయిత సి.నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా అనంత రచయితలు, సాహితీ సంఘాల వ్యవస్థాపకులు నాగలింగయ్య, రియాజుద్దీన్, ఈరన్న, టీవీరెడ్డి, నానీల నాగేంద్ర, హరీష్, ప్రవీణ్ తదితరులు ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతగా, సినీ గేయ రచయితగా, విమర్శకునిగా బహుముఖ ప్రజ్ఞతో తెలుగు వారి హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయిన సినారె జీవితం ఆదర్శప్రాయమన్నారు.

నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం

కనగానపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభమవుతున్నట్లు ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. మండలంలో ఆరు జిల్లా పరిషత్ పాఠశాలలు, 41 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు కనగానపల్లిలో కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలతో కలిపి మొత్తం 49 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆరు ప్రవేటు పాఠశాలలు ఉన్నాయి. వేసవి సెలవులు పూర్తి కావడంతో పాఠశాలలను పునః ప్రారంభించనున్నారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్లను పాఠశాలలకు సరఫరా చేశారు. వీటిని తొలిరోజే విద్యార్థులకు అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు మండల విద్యాశాఖాధికారులు తెలిపారు.

గుట్టను ఢీకొన్న లారీ



పావగడ రహదారిలో గుట్టను ఢీకొన్న లారీ

పెనుకొండ రూరల్: లారీ అదుపు తప్పి గుట్టను ఢీకొన్న సంఘటన పెనుకొండ సమీపంలోని రొద్దం – పావగడ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పావగడ వైపు నుంచి పెనుకొండ వైపు వెళ్తున్న లారీ బుధవారం తెల్లవారుజామున షీ ఫారం రైల్వే వంతెన వద్ద గుట్ట నుంచి దిగే క్రమంలో అదుపుతప్పి గుట్టను ఢీకొంది. ఈ ఘటనలో లారీ ముందు భాగం పాక్షికంగా దెబ్బతినింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

రాజ్య రైతు సంఘం అధ్యక్షుడిగా పూజారప్ప



పూజారప్పను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: కర్ణాటక రాజ్య రైతు సంఘం హసిరు సేనె తాలూకా అధ్యక్షుడిగా తాలూకాలోని బ్యాడనూరు బి దొడ్డహట్టికి చెందిన రైతు ఉద్యమకారుడు పూజారప్ప ఎన్నికయ్యారు. దావణగెరెలో బుధవారం జరిగిన రైతు సమ్మేళనం సభలో ఆ సంఘం అధ్యక్షుడు బసవరాజప్ప నేతృత్వంలో పూజారప్పను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పావగడకు చేరుకున్న పూజారప్ప విలేకరులతో మాట్లాడుతూ పావగడ రైతుల సర్వతోముఖాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తనను కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్న రాజ్యాధ్యక్షుడు బసవరాజప్పకు కృతజ్ఞతలు తెలిపారు. తాలూకా వ్యాప్తంగా పర్యటించి రైతు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పూజారప్పకు ఎంపికపై స్థానిక రైతు సంఘం నాయకులు, వివిధ సంఘాల నాయకులు హర్షం ప్రకటించారు.

వేలం ద్వారా రూ.3.53 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

అమరాపురం: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం పంచాయతీ ఆదాయ వనరుల వేలం పాట ద్వారా రూ. 3.53 లక్షల ఆదాయం సమాకూరినట్లు ఈఓఆర్డీ నాగముని, ఈఓ భాస్కర్ తెలిపారు. వారపు సంత, బస్టాండు, మటన్ మార్కెట్‌లకే ఈఓ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. బస్టాండు వేలం పాటను నాగరాజు రూ.1,78,000, వారపు సంతను జోగింద్ర, రూ.1,40,500, జంతువధశాల మంజునాథ్ రూ.35,100కు పాట పాడి దక్కించుకున్నట్లు చెప్పారు. దీంతో మొత్తం రూ.3,53,600 పంచాయతీకి ఆదాయం వచ్చినట్లు ఈఓ భాస్కర్ తెలిపారు. అలాగే దినసరి మార్కెట్‌కు ఎవరూ పాట పాడక పోవడంతో వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

నేడు వారపు సంత వేలం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలో వారపు సంతతో పాటు బస్టాండులో వ్యాపార వ్యవహారాలు నిర్వహించుకోవడానికి గురువారం ఉదయం 11 గంటలకు లేపాక్షి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే పాటదారులు వారపు సంతకు రూ.30 వేలు, బస్టాండుకు రూ. రూ. 2 లక్షలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.